క్లుప్తంగా

3 నుంచి దసరా ఉత్సవాలు

ఉండి: వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు క్రోధినామ సంవత్సర దసరా శరన్న వరాత్రి మహోత్సవాలను ఉండి రాజులపేటలోని పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు సన్నిధిరాజు శేషు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకుడు సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు.ఈ సందర్భంగా శనివారం ప్రత్యేక బ్యానర్‌ను ఆవిష్కరించారు.

అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి



భీమవరంలో న్యాయ విజ్ఞాన సదస్సు దృశ్యం

భీమవరం: అపరిచిత వ్యక్తులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వారి మాయ మాటల్లో పడవద్దని ప్యానల్ న్యాయవాదులు ఎన్.సుధీర్, పి.అంబేద్కర్ అన్నారు. భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న ఎస్సీ బాలిక కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాధిత నష్ట పరిహార పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కె.జ్యోతి, ఎంబీ భవాని, కె.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించడం కోసం లడ్డూ రాజకీయం

పాలకొల్లు అర్బన్: ఎన్నికల హామీలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించడం కోసం హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారని జెడ్పీటీసీ నడపన గోవిందరాజులనాయుడు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారంటూ నీచరాజకీయాలకు పాల్పడడం దుర్మార్గమని పేర్కొన్నారు. తిరుపతి లడ్డూపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి నిజనిర్ధారణ చేయాలని జెడ్పీటీసీ గోవిందరాజుల నాయుడు డిమాండ్ చేశారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మొగల్తూరు: అధిక వర్షాల కారణంగా తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపడితే వాటిని నివారించవచ్చని వ్యవసాయాధికారి అబ్దుల్ రహిమ్ సూచించారు. శనివారం మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం-2 సచివాలయ పరిధిలోని వ్యవసాయ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ వరి పంటపై పాము పొడ తెగులు వ్యాపిస్తే హెక్సాకానజోల్ 2 మిల్లీ లీటర్, వాలిడా మైసిన్ 1 ఎంఎల్, ప్రొపికోనజోల్ 0.4 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. ఆకుముడత ఆశిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాన్ట్ ట్రిప్రోల్ 0.3 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. సాగుకు సంబంధించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వంట గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి

నరసాపురం: వంట గ్యాస్ వినియోగంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భారత్ గ్యాస్ డీలర్ నెక్కంటి కృష్ణప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని వశిష్ట స్కూల్‌లో వంటగ్యాస్ సిలిండర్ వాడకం, ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భారత్ గ్యాస్ కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, గ్యాస్ మెకానిక్స్ పి.శ్రీనివాస్, కె.సతీస్, కె.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో అల్జీమర్స్ దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: అల్జీమర్స్ ముఖ్యంగా వంశపారంపర్యంగా సంక్రమిస్తుంటుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. శనివారం అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ, హెల్త్ కేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు ఎం.రామకృష్ణ, పి.జ్యోత్స్న, పి.శ్రీనివాసరావు, పి.శిరీష కుమారి తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాల వల్ల ఉజ్వల భవిష్యత్ నాశనం

నరసాపురం రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అడిషనల్ ఎస్పీ (ఎస్‌డీపీఓ) ఎస్‌బిఎం మురళీకృష్ణ అన్నారు. నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన నరసాపురం రూరల్ సీఐ జి దుర్గాప్రసాద్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. సదస్సులో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, డైరెక్టర్ అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.గోపిచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

హామీల అమలేది బాబూ ?

- ఆక్వాను ఆదుకున్న దాఖలాలు లేవు
- కరెంట్ బిల్లు షాక్‌లతో ఆక్వా రంగం విలవిల
- డ్రెయిన్ల అభివృద్ధి అటకెక్కినట్లేనా?



ఆక్వా చెరువులు

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు ఏరుదాటి తెప్ప తగలేసినట్లుగానే వ్యవహరిస్తారని మరోసారి నిరూపించినట్లు ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. 100 అబద్దాలాడి అందలమెక్కిన చంద్రబాబు 100 రోజుల పరిపాలనలో చేసిన వాగ్దానాలు నీటి మూటలుగా మారి పోయాయంటున్నారు.

ఊకదంపుడు హామీలు.. ఆచరణ శూన్యం

సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మూడు నెలల పాలనలో చేసిందేమీ లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అమరావతి నుంచి ఉండి నియోజక వర్గం వరకూ ఇదే పరిస్థితి. ఎన్నికల్లో ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇచ్చినా చిన్నా చితక పనులు తప్ప ప్రధాన హామీల అమలుకు నోచుకోలేదు. ఎన్నికల్లో ప్రస్తుత సీఎం చంద్రబాబు ఉండి నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించి ఊకదంపుడుగా ఇచ్చిన హామీలకు కదలిక లేకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కూటమి తరుపున పోటీ చేసిన ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల్లో అలవికాని వాగ్దానాలను ప్రజలకు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక నిధుల లేమి సాకుతో వాటిని నెరవేర్చే విషయంలో తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఆక్వా సాగుకు అందని ఊతం

ఉండి నియోజకవర్గంలో ప్రధాన పంటగా ఉన్న ఆక్వా ప్రభుత్వాలకు డాలర్ల పంట పండిస్తుంది. రైతులు మాత్రం కరెంట్ షాక్‌లతో దద్దరిల్లి కెవ్వున కేక వేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఉండిలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చేసిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు కాలేదు. ఇంటింటికీ కుళాయిల ద్వారా గోదావరి నీరు నేరుగా చేరవేస్తామన్నారు. పరిమళ్ల లాకుల వద్ద నుంచి ఒక్క చుక్క నీరు పారలేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ప్రజలు వెంకయ్య వయ్యేరు ద్వారా కలుషిత నీరే తాగుతున్నామని వాపోతున్నారు. ఆక్వా రంగాన్ని ఆదుకొని రైతుకు బాసటగా నిలుస్తామని ఇచ్చిన హామీ ఆక్సిజన్‌లా కరిగిపోయిందంటున్నారు. ఆక్వా కరెంట్ బిల్లుల షాక్‌తో రైతులు బెంబేలెత్తిపోతున్నామని వాపోతున్నారు. యూనిట్ ధర రూ.1.50 పైసలు చేస్తామని చేసిన వాగ్దానం, 500 టన్నుల కోల్డ్ స్టోరేజీల నిర్మాణం గడ్డ కట్టుకుపోయిందని ఏరియేటర్లపై సబ్సిడీలు గాల్లో తిరుగుతున్నాయా అని రైతులు ఎద్దేవా చేస్తున్నారు. నగర పంచాయతీగా అభివృద్ధి చెందిన ఆకివీడు పట్టణంలో పలు సమస్యలు నా దృష్టికి వచ్చాయని, వాటన్నింటినీ మీ ఎమ్మెల్యే ద్వారా పరిష్కరిస్తానని చేసిన వాగ్దానం ఒక్కటీ అమలు కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకివీడులో మురుగు డ్రెయిన్ల ప్రక్షాళనకు ఇచ్చిన హామీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యింది. క్లీన్ నియోజకవర్గం ఎలా ఉన్నా ఉండి, ఆకివీడులో ఆక్రమణలు తొలగించి, పేదవాడి గుడిసెలను తొలగించడంలో విజయం సాధించారని ఆయా ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఆకివీడులో రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ బ్రిడ్జి ఏదో ఒకటి నిర్మిస్తానన్న వాగ్దానం ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రజావేదిక కోసం ప్రత్యేకాధికారులు

ఉండి: ఈ నెల 26వ తేదీ వరకు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజావేదిక గ్రామ సభలకు పర్యవేక్షణాధికారులను నియమించినట్లు ఎంపీడీవో ఎస్ రవీంద్ర శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని ప్రచారం చేసే కార్యక్రమంలో భాగంగా స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన పెరగాలి

ఆకివీడు: సైబర్ నేరాల అదుపుకు ప్రజల్లో అవగాహన మరింతగా పెరగాలని అసోసియేషన్ ఫర్ లీగల్ అండ్ సోషల్ ఎవేర్‌నెస్ (ఏఎల్ఎస్ఏ) అధ్యక్షుడు బొమ్మిడి సన్నీరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సన్నీరాజ్ మాట్లాడుతూ ప్రజలకు కల్పించిన హక్కులను వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు ఎస్‌వై.రాజు మాట్లాడుతూ సమాచార చట్టం- వినియోగదారుడు గురించి వివరించారు. సభకు ప్రిన్సిపాల్ కె.సుజాత అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఆకుల తేజ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతితోనే దేశాల అభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: ప్రపంచంలో ప్రతి ఒక్కరూ శాంతిని సంస్కృతిగా పాటించాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శనివారం ఉండి లయన్స్ క్లబ్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చెరుకువాడ జెడ్పీ హైస్కూల్లో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శాంతి వేడుకల్లో భాగంగా శాంతి ర్యాలీ, ప్రపంచ శాంతిపై విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించి లయన్స్ గాదిరాజు రంగరాజు, ముదునూరి శివరామరాజు ఆర్థిక సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం ఎం పార్వతీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బ్రహ్మారెడ్డి, శివరామరాజు మాట్లాడుతూ ప్రపంచం శాంతియుతంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఉపాధ్యక్షుడు రంగరాజు, పార్వతీ మాట్లాడుతూ అందరూ శాంతియుతంగానే ముందుకు సాగాలని అన్నారు. బుద్ధరాజు సుబ్బరాజు, కాగిత మహంకాళి, బి హరనాథరాజు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపడమే బీజేపీ ధ్యేయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్

భీమవరం అర్బన్: నిత్యావసరాల పెంచి ప్రజలపై భారం మోపడమే కేంద్రంలో బీజేపీ ధ్యేయంగా పని చేస్తుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ విమర్శించారు. భీమవరం మండలంలోని తోకతిప్ప గ్రామంలో శనివారం సీపీఎం శాఖ మహాసభలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, నూనె ధరలతో పాటు నిత్యావసరాల ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టాలని తాగునీటిని ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాసరావు, రేవు రామకృష్ణ, తిరుమాని నాగేశ్వరరావు, బొడ్డు లక్ష్మీపతి ఏసు, తిరుమాని సూర్యనారాయణ, పొన్నమండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడిని నిరసిస్తూ ధర్నా



భీమవరంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమవరం: కొవ్వూరు మండలం శ్రీరామకాలనీ దళితపేటపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ డిమాండ్ చేశారు. శనివారం భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద శ్రీరామకాలనీపై దాడిని నిరసిస్తూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం తమ డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో పాలపర్తి జోనా, జంగం మాణిక్యాలరావు, మరపట్ల మునియ్య, కేసీ రాజు, గెద్దం జార్జ్, పట్టెం శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం



కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆటలు ప్రారంభిస్తున్న ఎంఈఓ రవీంద్ర

కాళ్ల: మండల స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కోపల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఆటల పోటీలు శనివారం ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారులు రవీంద్ర వెంకటేశ్వరరావు ఆటలను క్రీడలను ప్రారంభించారు. మండల స్థాయి సెలక్షన్లో కలవపూడి, బొండాడ, దొడ్డనపూడి, కోపల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలల నుండి అండర్ 16 అండర్ 17 విభాగాలలో వాలీబాల్, చెస్, కోకో, కబడ్డీ ఆటల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఆటల పోటీల్లో సెలెక్ట్ అయిన విద్యార్థులు సోమవారం నియోజకవర్గ స్థాయిలో మా గోల్డ్ జిల్లా పరిషత్ హై స్కూల్లో జరగనున్న పోటీల్లో పాల్గొన్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పీటీలు పాల్గొన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం దారుణం

కాళ్ల: మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని సీపీఎం కాళ్ల మండల కమిటీ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఏలూరుపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని స్వయంగా ఒక ఎమ్మెల్యే తొలగించటం దురుణమని అన్నారు. ఫ్లెక్సీ వల్ల ఇబ్బంది ఉంటే సంబంధిత నిర్వాహకులతో, ప్రభుత్వ అధికారులతో చట్టపరంగా చర్యలు చేపట్టాలని రాజ్యాంగాన్ని కాపాడవలసిన ప్రజాప్రతినిధులు రాజ్యాంగ నిర్మాత ఫ్లెక్సీని తొలగించడం ఎమ్మెల్యేకి తగిన గౌరవం కాదని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు సదర ఎమ్మెల్యే పాల్పడడం మర్యాద కాదని ఆయన హోదాని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని రెండు వర్గాల మధ్యన తగువు పెట్టే విధంగా ఎమ్మెల్యే గారు వ్యవహరించడం దారుణమని ఇది తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. ఇప్పటికై నా ఎమ్మెల్యే స్పందించి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, కమిటీ సభ్యులు కోరారు.

ఉండి ఎమ్మెల్యే వల్ల కుల, మత ఘర్షణలు

భీమవరం: ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజు వ్యవహార శైలి ప్రజల మధ్య కుల, మత ఘర్షణలు రెచ్చగొట్టేలా ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఏలూరుపాడులో జరిగిన ఘటనపై శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం ఏలూరుపాడులో నాగేంద్రస్వామి గుడి దారికి అడ్డుగా ఉందని అంబేద్కర్ ఫ్లెక్సీని ఎమ్మెల్యేనే స్వయంగా తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. లౌకికవాదాన్ని పాటించే మన దేశంలో ఏ మత విశ్వాసాన్ని అయినా అందరూ గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా నియోజకవర్గం ప్రజల మధ్య కుల, మత ఘర్షణలకు, విభజనకు దారితీసేలా వ్యవహరించే వైఖరిని రఘురామకృష్ణంరాజు విరమించుకోవాలని హితవు పలికారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

భీమవరం/వీరవాసరం: పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ట్రాఫిక్ సిఐగా బాధ్యతలు చేపట్టిన వి నారాయణమూర్తి శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబును మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే వరద బాధితుల సహాయార్థం భీమవరం కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ రూ.లక్ష సాయం అంజిబాబు చేతులమీదుగా సీఎం సహాయనిధికి అందించారు. అలాగే నౌడూరు జంక్షన్‌లోని పద్మాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం లక్ష రూపాయల చెక్కును, కొణితివాడలో నాలుగున్నర లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం నేలపోగుల గ్రామంలో మా మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



భారతీయ విద్యాభవన్స్‌లో క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక భారతీయ విద్యా భవన్స్ స్కూల్ విద్యార్థులు కరాటేలో బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపల్ దేవిపద్మ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం విలేకరులకు కు వివరించారు. ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో నిర్వహించిన నేషనల్ ఓపెన్ కరాటే బడేటి కప్ స్టేట్ ఛాంపియన్ పోటీల్లో అండర్-16 విభాగంలో మూడు బంగారు పతకాలు, మూడు బ్రాంజ్ మెడల్స్, అండర్- 10 కేటగిరిలో రెండు గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారన్నారు. అలాగే అండర్-19 విభాగంలో ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల గ్రూప్ ఎంపికైందని దేవిపద్మ తెలిపారు. అనంతరం క్రీడాకారులు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు కె.దుర్గాప్రసాద్, నల్లం నాగేశ్వరరావులను అభినందించారు.

మేడపాడులో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఇన్‌చార్జి హెచ్ఎం పూలపల్లి వేణుగోపాలాచారి

యలమంచిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగంలో మండల స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం యలమంచిలి హైస్కూల్లో శనివారం మేడపాడు హైస్కూల్లో నిర్వహించారు. యలమంచిలి తాళ్లూరి నారాయణస్వామి జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు జరుగగా, మేడపాడు హైస్కూల్లో శనివారం వాలీబాల్, చదరంగం విభాగంలో పోటీలు నిర్వహించారు. ఇక్కడి విజేతలకు 23, 24 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామని ఫెడరేషన్ పాలకొల్లు నియోజకవర్గ కార్యదర్శి రేలంగి రామకృష్ణ తెలిపారు. ముందుగా క్రీడాకారులను హెచ్ఎంలు చింతా చిట్టిబాబు, పూలపల్లి వేణుగోపాలాచారి పరిచయం చేసుకున్నారు. అండర్-17 బాలుర విభాగంలో వాలీబాల్‌కు 12 మంది క్రీడాకారులను, అండర్-14 బాలుర విభాగంలో వాలీబాల్‌కు 14 మంది క్రీడాకారులను, అండర్-17 చదరంగం బాలుర విభాగంలో మేడపాడు విద్యార్థి ఆర్.నాగరాజు, బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని పి.రేచల్ జోయ్, అండర్-14 చదరంగం బాలుర విభాగంలో శిరగాలపల్లి విద్యార్థి పి.రమణ, బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని రాజ్యలక్ష్మి, అండర్-17 వాలీబాల్ బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని పి.విష్ణు నాగప్రియ, అండర్-14 వాలీబాల్ బాలికల విభాగంలో చించినాడ విద్యార్థిని బి.వైష్ణవిలను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఫెడరేషన్ మండల కార్యదర్శి యాండ్ర సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు కాసా శ్రీనివాస్, కిరణ్ కుమార్, బొంతు కల్యాణి, భాస్కర్, వినాయక్ సహకారం అందించారు.

అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేస్తే చర్యలు



లక్ష్మణేశ్వరంలో తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్

నరసాపురం రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శనివారం నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో బాణసంచా తయారీ యూనిట్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. 18 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలను బాణసంచా తయారీలో ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జేసీ వెంట నరసాపురం తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ జెజవాడ సీతారత్నం, వీఆర్‌ఓ చిరంజీవి ఉన్నారు.

త్వరలో కాళీపట్నం భూముల సమస్య పరిష్కారం

మొగల్తూరు మండలం కాళీపట్నం ఎస్టేట్ భూముల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం గ్రామానికి విచ్చేసిన ఆయన రైతుల అభిప్రాయాలను తెలుసుకుని వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఆర్డీఓ అంబరీష్, తహసీల్దార్ విద్యాపతి ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. శనివారం కార్యాలయంలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా ఒక్కసారిగా కంప్యూటర్ రూంలో షార్ట్ సర్క్యూట్ అయ్యి మీటరు కాలిపోయి కిందపడిపోయింది. అక్కడే దస్త్రాలు ఉండడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమై ముందుగా అక్కడ ఉన్న రికార్డులను భద్రపరిచి మంటలను అదుపు చేశారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ముఖ్యంగా ఆలయ అర్చకులు స్వామి వారిని విశేషంగా అలకరించారు. స్వామి వారి దర్శన అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆలయ ఆవరణలో అన్నప్రసాదం అందించారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భీమవరం బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం మా క్లయింట్ శ్రీమతి [illegible] చెంచయ్య మార్టగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియచేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం. 3165/2013, భీమవరం పట్టణానికి చెందిన ఆర్.యస్. నం. 415/ 1ఎ లో 640.6 చ.గ. హద్దులు తూర్పు: ఈ ఆస్తిలోని దారి, పడమర: ఈ ఆస్తిలోని దారి, దక్షిణం: [illegible] ఉత్తరం: [illegible] సెకండ్ ఫ్లోర్ 1050చ.అ. ఫ్లాట్ నం. బి.48 హద్దులు. తూర్పు: [illegible], పడమర: [illegible] కారిడార్, ఉత్తరం: [illegible] దక్షిణం: ఫ్లాట్ నం.[illegible].

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం. బి.ఎల్. అడ్వకేటు, పాలకొల్లు, సెల్: 9490488782

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆకివీడు బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియచేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ [illegible] మార్టగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియచేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. నరసాపురం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం. 68/1997, భీమవరం మండలం [illegible] చెందిన డోర్ నం.3-108, అసెస్మెంట్ నం. 2673 లో, 470 చ.గ. నిర్మించిన భవనమునకు హద్దులు: తూర్పు: [illegible] స్థలం, పడమర: [illegible] స్థలం, ఉత్తరం: [illegible] స్థలం, దక్షిణం: రోడ్డు.

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం. బి.ఎల్. అడ్వకేటు, పాలకొల్లు, సెల్: 9490488782

ఘనంగా గురజాడ జయంతి



బీవీ రాజు పార్క్ వద్ద తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: గురజాడ రచనలు స్థిరస్థాయిలో నిలిచిపోతాయని కన్యాశుల్కం నాటకం రచన యుగాంతం వరకు ఉంటుందని రచయిత కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. భీమవరం బీవీ రాజు పార్క్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద శనివారం అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ రచనలపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు గురజాడ జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం, చెరుకువాడ రంగసాయి, కాకుమాని శ్రీనివాసరావు, జి సునీత, విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, పి.రాజశేఖర్, ఎల్.నర్సింహరావు పాల్గొన్నారు. ఏఆర్‌కేఆర్ మునిసిపల్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో రచయితల సంఘం జిల్లా వర్కింగ్ కార్యదర్శి మల్లుల సీతారామ్‌ప్రసాద్, హెచ్ఎం ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనాకోడేరులో..

భీమవరం అర్బన్: మహాకవి గురజాడ వెంకట అప్పారావు తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని ఆయన రచించిన కన్యాశుల్కం ఎంతో ప్రసిద్ధి చెందిందని ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ హైస్కూల్లో శనివారం రచయిత గురజాడ వెంకట అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. గురజాడ దేశభక్తి గేయాన్ని ఆలపించిన విద్యార్థిని బాలం ఆర్షితకు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, సంధి ప్రేమరాజు, వి మెర్సీ, నిర్మలాకుమా తదితరులు పాల్గొన్నారు.

గురజాడ ఆదర్శనీయుడు

ఆకివీడు: సాహితీ మూర్తి గురజాడ ఆదర్శనీయుడని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ్‌కుమారి అన్నారు. దుంపగడపలోని ఆంధ్రకేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం గురజాడ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపడంలో, వివక్ష ధోరణికి వ్యతిరేకంగా ఆనాడే ఆయన ఉద్యమించారని, తన సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. డీవైఎఫ్ఐ నాయకుడు బి.రాంబాబు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు సత్యనారాయణ, ఐద్వా నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. దుంపగడప జెడ్పీ స్కూల్లో గురజాడ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త విజయ్‌కుమార్, హెచ్ఎం ఎస్టీహెచ్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

